పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ తనిఖీలు

విశాలాంధ్ర-విజయనగరం : రాష్ట్ర నిఘా (విజిలెన్స్) విభాగం డైరెక్టర్, విజిలెన్స్ ఎస్.పి. బర్ల ప్రసాద్ ఆదేశాల మేరకు డెంకాడ మండలంలోని మూడు పెట్రోల్ బంక్ లలో శనివారం తనిఖీలు నిర్వహించినట్లు తనిఖీలకు నేతృత్వం వహించిన విజిలెన్స్ డి.ఇ. సత్యనారాయణ వెల్లడించారు. మోదవలసలో వున్న శ్రీ సత్యసాయి పెట్రోల్ బంక్, జొన్నాడలోని మార్తాండ ఏజెన్సీ, తిరుమల సత్యదేవ్ ట్రేడర్స్ పెట్రోల్ బంక్ లను విజిలెన్స్ అధికారులు, తూనికలు కొలతల అధికారుల బృందం తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. పెట్రోల్ ఉత్పత్తులు కొలతల మేరకు విక్రయిస్తున్నదీ లేనిదీ పరిశీలించడం జరిగిందని, సాంద్రత తగిన విధంగా వున్నదీ లేనిదీ పరిశీలించడం జరిగిందని, ఈ పెట్రోల్ బంక్ లలో రికార్డులు కూడా పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రంగారెడ్డి, విజిలెన్స్ ఏ.ఇ. రవికిరణ్, ఎస్.ఐ. బి.రామారావు తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించండి

తహశీల్దార్‌కు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట వినతి

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలంలో గిరిజన గ్రామాలు అయినటువంటి కృపవలస, దీవెనవలస, రామన్నవలస, సీయోనువలస చిన్న అక్కెనవలస గిరిజన గ్రామాలో గిరిజనులకు కనీస మౌలిక సదుపాయాలు రహదారి సౌకర్యం, మంచినీరు, విద్యుత్ సౌకర్యంలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గిగిరిజనకల్పించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం శ్రీనుకు శనివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట మాట్లాడుతూ మండల పరిధి మల్లంపేటకు ఆనుకుని ఉన్న అటవీ భూముల్లో ఎన్నో ఏళ్లుగా పొడు వ్యవసాయంచేసుకుంటూ అక్కడే నివాసముంటున్నారని సరైన మౌలిక సదుపాయాలు లేక గిరిజన కుటుంబాలు చంటి పిల్లలతో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని, ప్రభుత్వాలు మారుతున్న గిరిజనుల బ్రతుకులు మాత్రం మారడం లేదని. ఈ ఐదు గ్రామాలను దగ్గర్లో ఉన్న పంచాయతీలో చేర్పించాలని 15 ఏళ్లుగా పోరాటం సాగిస్తున్నామని అయినా గిరిజన సమస్యలు పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనగ్రామాల్లో కరెంట్ సౌకర్యం లేక రాత్రిపూట దోమలు పాముల మధ్య నరకాన్ని అనుభవిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అధికారులు స్పందించి గిరిజన ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. 1/70 యాక్ట్ అటవీ హక్కుల చట్టం ప్రకారం ఫారెస్ట్ భూములపై పూర్తిహక్కు గిరిజనులకే చెందే విధంగా ఈ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు బిహెచ్ లచ్చన్న సీతయ్య పాల్గొన్నారు.

రూ.కోటితో జిల్లా సర్వజన ఆసుపత్రికి అత్యాధునిక పరికరాలు

కలెక్టర్ అంబేద్కర్‌తో ఎంఓయు కుదుర్చుకున్న ఎన్‌పిసిఐఎల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి మహర్దశ పట్టనుంది. సుమారు కోటి రూపాయలతో ఆధునిక పరికరాలను అందించేందుకు కొవ్వాడ ఎన్‌పిసిఐఎల్ (నేషనల్ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్) ముందుకు వచ్చింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో ఆ సంస్థ ప్రతినిధులు శనివారం ఎంఓయు కుదుర్చుకున్నారు. సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి) నిధుల రూపంలో ఈ కోటి రూపాయలను వెచ్చించనున్నారు. ఈ నిధులతో జిజిహెచ్‌లోని ఆపరేషన్ థియేటర్, న్యూరాలజీ, యూరాలజీ, బయో కెమిస్ట్రీ, అనస్థీషియా, ఇఎన్‌టి, జనరల్ సర్జరీ విభాగాలకు వివిధ రకాల పరికరాలు సమకూరుస్తారు. దీనిలో భాగంగా న్యూరో డ్రిల్లింగ్ మిషన్, న్యూరో మైక్రోస్కోప్, న్యూరో సర్జరీ పరికరాలు, యురెత్రోస్కోప్, నెఫ్రోస్కోప్, యూనివర్సల్ నెఫ్రోస్కోప్, మినీపెర్క్ స్కోప్, లిథో మిషన్, కంప్రెసర్, టెలీస్కోప్, సిస్టోస్కోపీ సెట్, బయో కెమిస్ట్రీ అనలైజర్, దయాథెర్మీ, అనస్థీషియా వర్క్‌స్టేషన్, వీడియో లారింజోస్కోప్ సెట్, ఎం-3 మారథాన్ మైక్రోమీటర్, పేరా మీటర్లు-3 అందించనున్నారు. మార్చి నెలాఖరుకల్లా ఈపరికరాలను అందించనున్నారు. సిఎస్ఆర్ నిధులతో ఆసుపత్రికి అదనపు వసతులను సమకూర్చదానికి ముందుకు వచ్చిన ఎన్‌పిసిఐఎల్ కు జిల్లా కలెక్టర్ అంబేద్కర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఓ పి.బాలాజీ, డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, ఎన్‌పిసిఐఎల్ అసోసియేట్ డైరెక్టర్ కెవిస్విబివి ప్రసాద్, అడిషనల్ ఛీఫ్ ఇంజనీర్ బి.రవికుమార్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారిణికి అండగా వేపాడ గోల్డెన్ హార్ట్ ట్రస్టు

కేజీపూడికి చెందిన గమ్మెల లక్ష్మికి రూ.10వేల ఆర్థిక చేయూత

విశాలాంధ్ర-వేపాడ : ట్రస్టు పేరుకు తగ్గట్టు వారి హృదయాలు నిజంగా బంగారమే. ట్రస్టు స్థాపించిన నాటి నుండి ప్రతి నెలా ఎందరో అభాగ్యులను అక్కున చేర్చుకుని ఆర్థిక ఆసరా కల్పిస్తూ అండగా నిలుస్తూ ఎందరికో మార్గదర్శకంగా నిలుస్తున్న యువతను ఎంతైనా అభినందించక తప్పదు. మండల కేంద్రం వేపాడకు చెందినకొంతమంది యువతఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసే వారు, స్థానికంగా ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకునేవారు అంతా ఐకమత్యంగా ఉండి గోల్డెన్ హార్ట్ ట్రస్టు పేరిట నిస్వార్థంగా అందిస్తున్న సేవలు చిరస్మరణీయ మని చెప్పకతప్పదు. ఇప్పటికే నిరుపేద కుటుంబానికి చెందిన రోగికి ఆర్థిక ఆసరా అందించగా తాజాగా శనివారం ప్రతిభా వంతురాలైన యువక్రీడాకారిణికి గోల్డెన్ హార్ట్ ట్రస్టు సభ్యులు అండగా నిలిచారు. జాతీయ స్థాయిలో లాంగ్ జంప్ లో అనేక సార్లు అవార్డులు అందుకున్న మండలంలోని కొండగంగుబూడికి చెందిన గమ్మెల లక్ష్మి తల్లిదండ్రులు పేదరికం అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనే అవకాశం పొందడానికి అడ్డంకిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న గోల్డెన్ హార్ట్ ట్రస్టు సభ్యులు రూ. 10వేలను సమకూర్చి తమ వంతు సాయంగా అందజేశారు. ట్రస్టు సభ్యుల ఉదారత పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం కాగా వీరిని ఆదర్శంగా తీసుకుని మరికొంతమంది దాతలు ముందుకువచ్చి సహకరిస్తే మన గిరిజన ప్రాంతానికి చెందిన క్రీడా జ్యోతి అంతర్జాతీయ ఖ్యాతి పొందే అవకాశం ఉంటుంది. కాగా ఇప్పటికే మండలంలోని బానాది గ్రామానికి చెందిన ఎంపీటీసీ గొంప తులసీ, వెంకటరావు దంపతులు ఈ గిరిజన క్రీడాకారిణికి రూ 10వేలు అందించి తమ ఉదారతను చాటుకున్నారు.

సీతం-వీల్స్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాల లో శనివారం ప్రముఖ పారిశ్రామిక వీల్స్ ఇండియా కంపెనీతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యం లో వీల్స్ ఇండియా కంపెనీ హెచ్ ఆర్ ఏ దివాకర్ విద్యార్థులను ఉద్దేశించి మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఉండవలసిన నైపుణ్యం, ఉద్యోగ భద్రత, ఉద్యోగ అవకాశాల కోసం వివరించారు.అలాగే ఈ ఒప్పందం ద్వారా తాత్కాలిక శిక్షణ తరగతులు, పారిశ్రామిక సందర్శనలు భాగంగా తోడ్పాటు కల్పిస్తారు అని తెలిపారు. ఈసందర్భంగా సత్య విద్య సంస్థల డైరెక్టర్ డా మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సాఫ్ట్ స్కిల్స్ కూడా అవసరమని తెలుపుతూ మెకానికల్ నియామకాలు గత మూడు సంవత్సరాలుగా సీతం విద్యార్థులు ప్రముఖ కంపెనీలలో ఎంపిక అయ్యారన్నారు. ఈ ఒప్పందం ద్వారా మరింత అవకాశాలు పెరుగుతాయని విద్యార్థులకు తల్లితండ్రులకు ఒక భరోసా ఈ కళాశాల ఇవ్వడం జరుగుతుంది అని అభిప్రాయపడ్డారు.అలాగే సీతం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.డీ వీ రామమూర్తి మాట్లాడుతూ వీల్స్ తయారీ రంగం ఒక ప్రాముఖ్యతను, ఉద్యోగ అవకాశాలను ఈ కంపెనీ ద్వారా మరింత మేలు జరుగుతుంది అని తెలిపారు.ఈ ఒప్పందం వలన కళాశాల విద్యార్థులకు ప్రతి యేట ఉద్యోగ నియామకాలు, నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహణ జరుగుతుంది అని తెలిపారు.మెకానికల్ విభాగాధిపతి సీ హెచ్. వెంకట లక్ష్మి మాట్లాడుతూ ఈ ఒప్పందంతో మెకానికల్ విద్యార్థులకి అవసరమైన నైపుణ్యాన్ని, ఉద్యోగ అవకాశాలు అందుకోగలమన్నారు. ఈకార్యక్రమంలో సీహెచ్.వెంకటలక్ష్మి (విభాగాధిపతి మెకానికల్), విభాగ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులందరికీ న్యాయం చేస్తాం

516బి రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులతో ఆర్డీఓ చర్చలు

విశాలాంధ్ర-కొత్తవలస : పెందుర్తి నుంచి బొడ్డవర వరకూ గల 516బి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులందరికీ న్యాయం చేస్తామని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి స్పష్టం చేశారు. కొత్తవలస తహసీల్దార్ బి. నీలకంఠరావు ఆధ్వర్యంలో శనివారం కొత్తవలస పెన్షనర్ల భవనంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆమె రైతులతో మాట్లాడారు. చింతలపాలెం, దేశపాత్రునిపాలెం, మంగళపాలెం, రామచంద్రపురం, గవరపాలెం, సీతంపేట తదితర గ్రామాల రైతులతో ఆమె చర్చించారు. ఈ జాతీయ రహదారి విస్తరణ అనే అంశం కొత్తగా నిర్ణయించింది కాదని, సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న అంశమని, ఇందులో రైతులందరికీ పూర్తి అవగాహన ఉందని ఆర్డీఓ ముందుగా వ్యాఖ్యానించి సమావేశాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు వారి, వారి సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఆమె ప్రతీ రైతు సమస్యలను పరిష్కరించేందుకుగాను రెవెన్యూ సిబ్బందితో టీములను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 2023 ఆగస్టుకు ముందు లాండ్ కన్వర్షన్ పూర్తి చేసుకున్న రైత్వారీ భూములకు నిబంధనల మేరకు పరిహారం చెల్లింపులు ఉంటాయని తెలియజేసారు. 2024 జనవరికి ముందు చాలానాలుంటే రైతులు కార్యాలయంలో సిబ్బందికి అందించాలని వాటిని ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సాగులో ఉన్న పండ్ల చెట్లు, వివిధ రకాల చెట్లకు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ద్వారా అందించే ఎన్యుమరేషన్ ద్వారా పరిహారం చెల్లిస్తామని, రైతులు అవగాహనతో అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, వీఆర్‌ఓలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో ఈ నెల 27న నిర్వహించబోవు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికలను సజావుగా, ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి స్థానం కోసం జరగనున్న ఎన్నికల పక్రియలో భాగంగా విజయనగరం పట్టణంలోని ప్రభుత్వ సంగీత కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సందర్శించారు. పోలింగు కేంద్రంలో ఉన్న పోలింగు స్టేషన్ గదులను పరిశీలించి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, సిసి కెమెరాలు అన్ని సక్రమంగా పనిచేసేలా చూడాలని పోలీసు, రెవిన్యూ అధికారులను ఆదేశించారు. పోలింగు కేంద్రంలో మౌళిక వసతులు, సౌకర్యాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూ లైన్లు సక్రమంగా ఏర్పాటు చేసుకొని ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పోలింగు రోజు పోలింగు అధికారులు, సిబ్బంది , ఓటర్లు యొక్కవాహనాలు పార్కింగ్ చేసుకొనేందుకు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలింగు కేంద్రాలు వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో విజయనగరం 1వ పట్టణ సిఐ ఎస్. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఎ.వి.లీలారావు, ట్రాఫిక్ సిఐ సూరినాయుడు , రెవిన్యూ అధికారులు, ఎస్ఐలు రామగణేష్, ఎస్.రవి మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర-విజయనగరం : 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించిన విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆ ప్రక్రియ ఏ విధంగా సాగుతోందన్న విషయమై శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సచివాలయాల పరిధిలో అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పన్ను వసూళ్లను చేపడుతున్నారు. లక్ష్యాలను చేరాలన్న ఉద్దేశంతో కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి తగు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆస్తిపన్ను, కులాయి పన్ను, ఖాళీ స్థలముల పన్నుల వసూళ్లను ముమ్మరం చేస్తూ దీర్ఘకాల బకాయిలను కూడా రాబట్టేందుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేస్తున్నారు. ఈ విధానాన్ని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొండి బకాయిలను ఉపేక్షించ వద్దని రెడ్ నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైతే విద్యుత్ సరఫరాలను కూడా నిలుపుదల చేయాలని సిబ్బందికి సూచించారు.

రైతు ఆత్మహత్యా ప్రయత్నంపై ఆర్.డి.ఓతో విచారణ

విశాలాంధ్ర-నెల్లిమర్ల : నెల్లిమర్ల మండలం చనుమల్లు పేట గ్రామానికి చెందిన చనుమల్లు అబద్ధం అనే రైతు మ్యుటేషన్ కోసం రెవిన్యూ అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారని, శుక్రవారం నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు వచ్చిన వార్తలపై కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ స్పందించారు. విజయనగరం ఆర్.డి.ఓ ను విచారణా అధికారిగా నియమించి సంఘటన పై సమగ్రంగా విచారణ జరిపి నివేదికను అందించాలని ఆదేశించారు. నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర-గుర్ల : మండల టిడిపి కార్యాలయంలో వైసీపీకి చెందిన ఎస్.ఎస్.ఆర్ పేట సర్పంచ్ వసంత వీరమ్మతోపాటు వార్డ్ నెంబర్, రాగోలు గ్రామ సర్పంచ్ చందక బంగారునాయుడుతో పాటు సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలో పొలిట్ బ్యూరో సభ్యులు చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి టిడిపి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు, ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైసీపీ అధికార ప్రతినిధిగా రేగిడి లక్ష్మణరావు నియామకం

విశాలాంధ్ర-మెరకముడిదాం : మెరకముడిదాంకు చెందిన రేగిడి లక్ష్మణరావు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పార్టీ అధిష్టానం నియమించింది. అధిష్టానం తనను జిల్లా పార్టీ అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావుకు, మాజీ మంత్రివర్యులు బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకనుండి అధిష్టాన ఆదేశాలు తూచా తప్పకుండా పాటిస్తూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని రేగిడి వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు ఓటింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఎన్నికల్లో ఓటు వేయడానికి వీలుగా ఓటు హక్కు ఉన్న వారికి తమ ఓటును వినియోగించుకునే వీలుగా ఓటింగ్ రోజున అనగా ఈ నెల 27న స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను భారత ఎన్నికల సంఘం ప్రకటించిందని కలెక్టర్ డా.బి.ఆర్. అంబెద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 27న ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలకు, ఏర్పాట్ల నిమిత్తం ముందు రోజు అనగా 26న కూడా స్థానిక సెలవుగా ప్రకటించడం జరిగిందని తెలిపారు.

గర్భం మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో ఉన్న గర్భం మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 25 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. ఐదో తరగతి స్థాయిలో ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ఇంగ్లీష్,తెలుగు మాధ్యమాల్లో పరీక్ష నిర్వహించబడుతుందని. అలాగే ఏప్రిల్ 27న మెరిట్ జాబితాను విడుదల, ఏప్రిల్ 30 న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని తెలిపారు.

తడి చెత్తతో హోమ్ కంపోస్ట్‌పై అవగాహన కల్పించిన కమిషనర్

విశాలాంధ్ర-రాజాం : ఈ రోజు రాజాం మున్సిపల్ కమిషనర్ జె. రామప్పలనాయుడు ఆధ్వర్యంలో కొత్తవలస సచివాలయం పరిధిలో, ఆదర్శనగర్ సచివాలయం పరిధిలో ఉన్నటువంటి ప్రజలకు ఇంట్లో వంట గది నుంచి వచ్చు తడి చెత్తతో హెూమ్ కంపోస్టు తయారీ విధానాన్ని ప్రజలకు ఎలా చేయాలో కమిషనర్ జె.రామప్పల నాయుడు కార్యక్రమంలో వివరించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి హెూమ్ కంపోస్టు తయారీ కోసం అవసరమైన బిన్నును ఇవ్వడం జరిగింది సదరు కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ చేగొండి ప్రసాద్, మెప్మా సిబ్బంది, శానిటేషనే సెక్రటరీలు, సానిటరీ సూపర్వైజర్ మరడాన అప్పలనాయుడు, పబ్లిక్ హెల్త్ వర్కర్స్ పాల్గొనడం జరిగింది.

రైతుల సమక్షంలోనే రీసర్వే

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ పరిశీలన

విశాలాంధ్ర-భోగాపురం: రైతుల సమక్షంలోనే రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. భోగాపురం మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్న రావాడ గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. గ్రౌండ్ ట్రూతింగ్ ను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ఎవరి భూమునైతే రీ సర్వే చేపడతారో, ఆ భూమి హక్కు దారులను తప్పనిసరిగా రప్పించి, వారి సమక్షంలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ పొలం చుట్టుపక్కల రైతులను కూడా సర్వే నిర్వహిస్తున్నప్పుడు పిలవాలని సూచించారు. నిర్ణీత కాల వ్యవధిలో లోగా రి సర్వే ప్రక్రియను తప్పులు లేకుండా పూర్తి చేయాలని జెసి స్పష్టం చేశారు. తాసిల్దార్ సురేష్, డిప్యూటీ సర్వే ఇన్స్పెక్టర్ భగవాన్, ఇతర రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : ఉత్తరాంధ్ర రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారని భారతీయ వ్యవసాయ మండలి పరిశోధన కేంద్రం సంచాలకులు డాక్టర్స్ తార సత్యవతి అన్నారు. గాజులరేగ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శనివారం నిర్వహించిన గిరిజన పలు ఉపకార పరికరాలను అందజేశారు. రానున్న రోజుల్లో చిరుధాన్యాల సాగు దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించుతుందని, అలాగే మనిషి ఆరోగ్యానికి సంబంధించిన జీవన మనుగడ లో చిరుధాన్యాల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలతో తయారుచేసిన ఉప ఉత్పత్తులను ఆమె సందర్శించే సంతృప్తి వ్యక్తం చేశారు. పోషక విలువలు అందించే పంటలను ఉత్పత్తి చేయాలని సూచించారు . కార్యక్రమంలో డాక్టర్ టి. ఎస్. ఎస్. కే.పాత్రో, డాక్టర్. జి.ఆదిలక్ష్మి , నాబార్డ్ ఏజీఎం టి. నాగార్జున, వ్యవసాయ శాఖ ఉపసంచకులు ఆనంద్, టిఎస్పి ఇన్చార్జి డాక్టర్ ఎస్. సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలి : ఎంపీడీవో ఐ.సురేష్

విశాలాంధ్ర-చీపురుపల్లి : పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్క ఇంటి యజమానులు ప్రాముఖ్యతను ఇవ్వాలని చీపురుపల్లి ఎంపీడీవో ఐ సురేష్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని పురవీధులలో శనివారం నాడు చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింట ప్రచారం నిర్వహిస్తూ ప్రతి ఒక్కరూ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇంటిలో పేరుకుపోయిన తడి చెత్త పొడి చెత్త నిల్వలను భద్రపరచాలని, వాటి ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసి సంపదను సృష్టించుకోవచ్చునని ఎంపీడీవో వివరించారు, ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని పలు వీధులలో చెత్త బుట్టల పంపిణీ కూడా నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే అంటూ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ కార్యదర్శి వై ఝాన్సీ రాణి, సానిటరీ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, సూపర్వైజర్ రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర 'కార్యక్రమం

విశాలాంధ్ర-డెంకాడ : మండలంలోని అన్ని గ్రామాలలో ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మరియు కమీషనర్ పంచాయతీ రాజ్ & రూరల్ డవలప్మెంట్ వారు మరియు జిల్లా పంచాయతీ అధికారి వారి ఆదేశాల మేరకు డెంకాడ మండలం లో అన్ని గ్రామపంచాయతీ లలో స్పెషల్ డ్రైవ్‌గా డోర్ టు డోర్ కలెక్షన్ శని, ఆదివారలలో చేయవలసినదిగా గా తెలియజేసి వున్నారు కావున ఈ శనివారం డెంకాడ మండలంలో విస్తరణాధికారి (పి ఆర్ & ఆర్ డి) దేశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారుల సమక్షంలో జొన్నాడ, ఆకులపేట, అక్కివరం, గంట్లాం, డెంకాడ, నాతవలస గ్రామ పంచాయతీలు పరిశీలించి గృహ యజమానులకు సూచనలు తెలియజేస్తూ మండలంలో అన్ని గ్రామపంచాయతీలలో అమలు అయ్యేవిధంగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది.మండలం లో 16,340 ఇండ్లకు ఇంటింటికి వెళ్లి చెత్త కలెక్షన్ చేయడం జరిగింది ఇదే పద్ధతిలో గృహ యజమానులు క్లాప్ మిత్ర వచ్చే సమయంలో తడి చెత్త, పొడి చెత్త, హానికరమైనచెత్త వేరు వేరుగా ఇవ్వవలసినది గా అవగాహనా కల్పిస్తూ గ్రామపంచాయతీ కి పాల్థిన్ కవర్లు ఎవరైనా ఇచ్చినయెడల ఒక కేజీ కి రూ10/- కొనుగోలు చేస్తారని అదేవిధంగా ఎవరికైనా వర్మీ కంపోస్ట్ కావాలంటే కేజీ రూ 10/-కి అమ్మబడునని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

నానంబా గార్డెన్లో అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో విజయనగరం కార్యాలయంలో జ్ఞానాంభ గార్డెన్లో భారత మొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు 4 రాజు మాట్లాడుతూ భారత స్వతంత్ర ఉద్యమంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ క్రియాశీలక పాత్ర వహించారని అన్నారు. దూరదృష్టి ఉన్న మహా నాయకుడు స్పల్ ప్రజ్ఞత్ కలిగిన మహా మనిషి మౌలాన అని అన్నారు. 1912 సంవత్సరంలో ఆల్ హి లాల్ పత్రికను స్థాపించి స్వతంత్ర ఉద్యమానికి బలోపేతానికి కృషి చేశారని అన్నారు. వారు క్విట్ ఇండియా ఉద్యమం లాంటి ఉద్యమాల్లో పాల్గొన్నందుకు పది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారని అన్నారు. దేశంలో ఐఐటి ఐఐఎం స్థాపనకు ఆజార్ కృషి చేశారని గ్రంథాలయ సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ అన్నారు. విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాలు చేసిన మౌలాన చెరగని ముద్ర అని సంఘం అధ్యక్షులు ఎర్నానాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో త్యాడ చిరంజీవి, డి సన్యాసిరాజు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీనేత గోపాలకృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన చిన్న శ్రీను

విశాలాంధ్ర-జామి: స్థానిక వైసీపీ సీనియర్ నేత ఆంధ్ర గోపాలకృష్ణ కుటుంబాన్ని శనివారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. జామిలోని పడాల వీదిలో ఉన్న గోపాల్‌కృష్ణ ఇంటికి వెళ్ళి ఆయనను పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం గోపాలకృష్ణ కుమారుడు అనారోగ్యంతో మరణించారు. ఈసందర్భంగా చిన్న శ్రీనుతోపాటు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గోపాలకృష్ణను, అతని కుటుంబాన్ని ఓదార్చారు. ఇటువంటి సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. చిన్న శ్రీను, కడుబండితోపాటు స్థానిక వైసీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, ఎంపిపి అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, స్థానిక గ్రామ ఉపసర్పంచ్ అల్లు పద్మతోపాటు పలువురు నేతలు గోపాల్ ఇంటికి వచ్చి పరామర్శించారు.

ఏసీబీ అధికారి పేరుతో విఆర్‌వోకు బెదిరింపులు

రూ.2లక్షలు ఇస్తే కేసు మాఫీ.. లేదంటే అరెస్టు అంటూ హెచ్చరికలు

జిల్లాలో సంచలనం కలిగిస్తున్న రైతు ఆత్మహత్యా యత్నం సంఘటన

విశాలాంధ్ర-నెల్లిమర్ల : నెల్లిమర్ల తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఓ రైతు ఆత్మహత్యా యత్నం చేసిన సంఘటన ప్రస్తుతం జిల్లాలో సంచలనంగా మారింది. రైతు తనకు న్యాయం కావాలని ఒకవైపు కోరుతుండగా, లంచం ఇస్తేనే పనిచేస్తామని చెప్పారని మరో ఆరోపణ చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఈసంఘటన అన్ని పత్రికలు, చానళ్ళలలో ప్రసారం కావడంతో జిల్లా అధికారులు సైతం స్పందించారు. ఇదిలా వుండగా ఈసంఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గుషిణి విఆర్‌వో గోవింద్‌కు శనివారం ఎసిబి అధికారి పేరుతో ఓ బెదిరింపు కాల్ రావడం ప్రస్తుతం చర్చానీయాంశంగా మారింది. తాను ఎసిబి అధికారినని, నిన్ను అరెస్టు చేయమని అధికారులు ఆదేశించారని, బెయిల్ పెట్టుకోవడానికి సిద్ధం చేసుకోవాలని ఫోన్‌లో ఉదయం బెదిరించారు. గోవింద్‌తోపాటు అతని భార్యతోనూ సదరు ఎసిబి పేరు చెప్పిన అధికారి మాట్లాడి వారిని భయాందోళనకు గురి చేసారు. వారంతా భయంతో ఉన్నారని గ్రహించిన సదరు నకిలీ అధికారి గోవింద్‌ను ఇంటినుంచి బైటకు రమ్మని చెప్పి రహస్యం అంటూ, ఎవరికి చెప్పవద్దని చెబుతూ తనకు రెండు లక్షలు ఇస్తే కేసు నీమీద లేకుండా చేస్తానని డిమాండ్ చేసారు. అసలు విషయం చెప్పడంతో తాను ఏతప్పూ చేయలేదని, తనను ఎందుకు అరెస్టు చేస్తారని విఆర్‌వో సదరు అధికారితో వాదించారు. చివరకు అరెస్టు తప్పదని అధికారి భయపెట్టారు. ఈమొత్తం ఫోన్‌కాల్ సంభాషణను విఆర్‌వో రికార్డు చేసారు. ఈఫోన్ కాల్ విషయం బైటకు రావడంతో మండలంలో చర్చకు దారి తీసింది. జిల్లాలోని ఇంటిలిజెన్స్ విభాగం సైతం ఈఫోన్‌కాల్‌పై ఆరా తీస్తున్నారు. మరోవైపు పలువురు పెద్దలు ఈసంఘటనలు తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఈవిషయమై అధికారులు ఏవిదంగా స్పందిస్తారో వేచి చూడాలి.

ఇంటింటి నుండి చెత్త సేకరణ

విశాలాంధ్ర-భోగాపురం : పల్లెల పరిశుభ్రతలో ప్రతి పౌరుడు భాగస్వామి కావా లని మండల అభివృద్ధి అధికారి కె. గాయత్రి పిలుపునిచ్చారు. ఇంటింటి నుండి చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా భోగాపురం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్యం, ఇంటింటి చెత్త సేకరణ పను లను ఆమె పరిశీలించా రు. చెత్త సేకరణ ఆటోలు ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేయాలని కార్యద ర్శులకు, పారిశుధ్య కార్మికులకు సూచించారు. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా తప్పనిసరిగా మీ ఇంటి వద్దకే వచ్చి చెత్తను సేకరిస్తున్న వాహనా లకు అందివ్వాలని కోరారు. ఇంచార్జి ఇ.ఓ తేజ, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

రఘువర్మ విజయానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు, రాష్ట్ర మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు, విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు, విజయనగరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ఇందుకూరి సుబ్బలక్ష్మి, పార్లమెంట్ ప్రధానకార్యదర్శి ఐ.వి.పి. రాజు, పార్టీ ముఖ్యనాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారం జరుగుతున్న తీరుని సమీక్షించారు, అదేవిధంగా ఓటర్లు అందరినీ కలిసి కూటమి ప్రభుత్వం మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ విజయానికి కృషి చేసేలా శ్రేణులు అందరు పని చేయాలని కోరారు. ఫిబ్రవరి 27న జరిగే ఎలక్షన్ పోలింగ్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతి రాజు అన్నారు.

ఉపాధ్యాయ బహుజన సంఘాల అభ్యర్థి పోతుల దుర్గారావును గెలిపించండి

విశాలాంధ్ర-రాజాం : ఉపాధ్యాయ శాసన మండలికి త్వరలో ఎన్నికలు జరగనున్న సందర్భముగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు (అరకు), పార్వతీపురం (మన్యం) జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గంలో బహుజన సంఘాల దాని మిత్ర సంఘాల అభ్యర్థిగా రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. టీచర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు పోతల దుర్గారావు పోటి చేస్తుయున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్.సి., ఎస్.టి. బడుగు బహుజన ఉపాధ్యాయుల కోసం 1991 సం? ఎస్.సి., ఎస్.టి. టీచర్స్ ఫెడరేషన్ ను స్థాపించిన పోతల దుర్గారావును సంఘ ఫౌండర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మూడు దశాబ్దాల పాటు ఉపాధ్యాయలోకానికి తమ ఉత్తమమైన ఉన్నతమైన నిస్వార్థంగా సేవలను అందించిన ఉద్యమకారుడు, మన ముద్దుబిడ్డ జ్యోతిరావుపూలే, అంబేద్కర్ ఆశయాలలో నిరంతరం పనిచేస్తున్న మన బహుజనుల ఉద్యమనేత అనేక ఉమ్మడి ఉద్యమాలలో పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ప్రజా సంఘాలతోను సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న అభ్యర్థి పోతల దుర్గారావు ఎస్.టి.యు., డి.టి.ఎఫ్. యు.టి.ఎఫ్. ఎస్.సి. ఎస్.టి. యు.ఎస్. బి.టి.ఏ. అనేక ఉపాధ్యాయ సంఘాలతో పనిచేసి మంచి స్నేహ పూరిత సంబధాలు కలిగి మనకోసం ఎస్.సి., ఎస్.టి.టి.ఎఫ్. సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి కూడ నడిపిస్తూ బడుగు బలహీన వర్గాల పీడిత జనాల హక్కు సాధన కోసం దళిత హక్కుల పదిరక్షణ సమితి సంఘంను నడిపిస్తున్న ఉద్యయ నేత జ్యోతిరావుపూలే, అంబేద్కర్, కొమరంభీం ఆలోచనలతో 35 సం,లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, సామాన్య ప్రజలకు నిస్వార్థ సేవలను నిరంతరం అందిస్తున్న నిస్వార్థ నాయకుడు పోతల దుర్గారావు, కావున సీరియల్ నెంబర్ 4పై ఓటు వేసి దుర్గారావును గెలిపించాలి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మను అత్యధిక మెజారిటీతో గెలిపించండి

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని, ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి కోరారు. ఎస్.కోట పట్టణ కేంద్రంలో గల జడ్పీహెచ్ ఉన్నత పాఠశాల మరియు చైతన్య జూనియర్ కళాశాలలో పలువురు టీచర్లను కొమరాడ మాజీ జెడ్పిటీసీ ఎస్.శేఖర్ పాత్రుడు తో కలిసి ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించడం జరిగింది. ఎస్.కోట మండలంలో ఓటర్లుగా నమోదు కాబడిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులను కలిసి శ్రీ పాకలపాటి రఘువర్మ యొక్క వ్యక్తిత్వం చూసి, మన రాష్ట్ర శ్రేయస్సు కోసం, ఆయన చేసిన కృషిని గుర్తించి, గెలిపించాలన్నారు. అదేవిధంగా మీ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో ఉన్న ఉపాధ్యాయులు అందరూ కలిసి ఫిబ్రవరి 27వ తేదీన జరిగే ఎన్నికల పోలింగ్ లో రఘువర్మ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రఘువర్మ గెలుపు ప్రభుత్వనికి వారధి అయి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మండల పార్టీ నాయుకులు అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీతం ఎలక్ట్రికల్ విద్యార్థులు సబ్‌స్టేషన్‌ను సందర్శన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణలో భాగంగా విజయనగరం, నెల్లిమర్లలోగల అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ట్రాన్స్ఫార్మర్లు, రిపేరు విభాగము, సబ్‌స్టేషన్ భవనాలను సందర్శించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాన్స్ఫార్మర్ పనితీరు, రిపేరింగ్, ట్రాన్స్ఫార్మర్‌లో ఉన్న వివిధ విభాగంలో పనితీరుపై అవగాహన కల్పించడం జరిగింది. దీంతోపాటు స్థానిక ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న సబ్ స్టేషన్ పనితీరుపై వైస్డర్ వి.గణేష్, ఏ.ఈ కే. కమల, ఏ.డి.ఈ ఎల్. సత్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సైతం సాంకేతిక నిపుణులతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ ఇలాంటి పరిశ్రమల సందర్శన విద్యార్థుల శిక్షణకు మేలు అవుతాయని, భవిష్యత్తులో ఎలక్ట్రికల్ అవసరాలకు అనుగుణంగా వారిని నైపుణ్యంగల ఇంజనీర్లుగా తీర్చిదిద్దడమే మాకళాశాల లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, డీన్ డాక్టర్ వై.నరేంద్ర కుమార్,ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు వి. శరత్ కుమార్, ఆర్. పావని విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శృతిమించిన రాజకీయాలు : భీశెట్టి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : ఫిబ్రవరి 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీల శృతిమించిన జోక్యంతో ఎన్నికల తీరు చూసి విస్మయం కలుగుతుందని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎవరికి తమ ఓటు వెయ్యాలో తెలియని వ్యక్తులు కాదని వారు సమాజ అభివృద్ధికి మార్గదర్శకులని వారు వారి ఓటుని స్వేచ్ఛగా ఓటు వేసుకునే పరిస్థితి లేకుండా ఎమ్మెల్యేలు, ఎంపీలు,కొన్ని రాజకీయ పార్టీల నేతలు మధ్యలో దూరి ఉపాధ్యాయులను, యూనియన్‌లను రాజకీయ పావులుగా వాడుకుంటున్నాయని భీశెట్టి ఆరోపించారు. ప్రశాంతంగా జరగవలసిన ఎన్నికల్లో దూరే బదులు ప్రతి ఎమ్మెల్యే తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేవా, విద్యార్థులకి మంచి ప్రమాణాలతో కూడిన విద్య అందుతుందో లేదో చూస్తే ప్రజలు సంతోషిస్తారని, ఉపాధ్యాయుల సమస్యలపై తమ గళాన్ని బలంగా వినిపించగలిగిన వ్యక్తిని ఉపాధ్యాయులే ఎన్నికుంటారని,ఎన్నికల అనంతరం అన్ని యూనియన్ల ఉపాధ్యాయులు కలిసిమెలసి పనిచేసి విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దాలని దయచేసి పాఠశాలలను రాజకీయ కేంద్రాలుగా మార్చవద్దని రాజకీయ పార్టీల నేతలను,ఉపాధ్యాయ సంఘాల నేతలను భీశెట్టి కోరారు. ఈ సమావేశంలో మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపి, పౌర వేదిక ప్రతినిధి తుమ్మగంటి రాంమోహన్ రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో పాల్గొన్న: బాబు రెడ్డి

విశాలాంధ్ర-మెంటాడ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా శనివారం మెంటాడ మండలంలో మోడల్ స్కూల్ కేజీబీవీ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రచారంలో పాల్గొన్న యుటిఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబు రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కె. విజయ గౌరీ పోటీ చేయుచున్నారని అందరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఒక తాటిపైకి తీసుకువచ్చి ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. శాసన మండలి ఎన్నికల్లో ఉపాధ్యాయుల అధ్యాపక సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కే విజయ్ గౌరీ మండల ఎన్నికల్లో గెలిపించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. సిపిఎస్ రద్దు 12వ పి ఆర్ సి అమలు గత పిఆర్సి బకాయిల డిఏ బకాయిలు. జీవో 117 రద్దు తదుపరి సమస్యలు పరిష్కారం కావాలంటే పిడిఎఫ్ అభ్యర్థి కె. విజయ గౌరీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించవలసిందిగా కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్ భాస్కర్ రావు జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి. రాంప్రసాద్ మండల ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ సహాయ అధ్యక్షులు సిహెచ్ రవి పెంకి రవి వివిధ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యాలు కలగకూడదు

సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలి : ఆర్డీవో జి.సత్యవాణి

విశాలాంధ్ర-చీపురుపల్లి : భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను విజయవంతం చేయాలని చీపురుపల్లి ఆర్డీవో జి సత్యవాణి అన్నారు. శనివారం నాడు చీపురుపల్లి ఆర్డీవో కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ సత్యవాణి మాట్లాడుతూ మార్చి నెల రెండు మూడు నాలుగు తేదీలలో చీపురుపల్లిలో జరగనున్న శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు మూడు రోజులపాటు లక్షలాదిమంది భక్తులు దర్శించుకోనున్నారని ఆమె వివరించారు. జాతరలో త్రాగునీరు, అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక సేవలతో పాటు విద్యుత్ శాఖల అధికారులు కూడా అందుబాటులో ఉండాలన్నారు. అత్యవసర వైద్య సేవలకు సంబంధించి జాతర ప్రాంగణంలోని శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు అందుబాటులో సేవలను అందజేయాలని ఆమె కోరారు. పోలీస్ శాఖకు సంబంధించి మూడు రోజులు పాటు భక్తులు ప్రతిగా జాతరలో పాల్గొంటున్న సమయంలో ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. ప్రత్యేకించి భక్తుల రాకపోకల తో పాటు దర్శనం చేసుకునే సమయంలో కూడా ఇటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. చీపురుపల్లి శ్రీకాకుళం ప్రధాన రహదారులు జాతర జరుగుతున్నందున భక్తులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. వాహనాల రాకపోకలతో భక్తులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకూడదు అన్నారు. నిర్దేశిత ప్రాంతాలలో వాహనాల పార్కింగ్లో ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జాతర జరిగే ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న దుకాణాలు కూడా పోలీస్ పంచాయతీ ఆలయ కమిటీ నిర్వాహకుల ఆదేశాల మార్కెట్ ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. జాతర ఎటువంటి అశ్లీల సాంస్కృతిక కార్యక్రమాలు జరగకుండా కమిటీ నిర్వాహకులు జాగ్రత్త వహించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగిన ప్రాంతంలో ఇటువంటి తొక్కి సలాటలు ప్రమాదాలు గొడవలు జరగకుండా పోలీస్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎటువంటి రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు హోల్డింగులు ఏర్పాటు చేయకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా జాతర ప్రాంగణంలో ఇటువంటి పందాలు గానీ జూదాలకు సంబంధించిన క్రీడలు గాని ఏర్పాటు చేయకూడదు అన్నారు. జాతర ప్రాంగణ పరిసరాలలో బెల్టు షాపులు నిర్వహించి మద్యం అమ్మకాలు జరపకుండా సంబంధిత శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. తాగుబోతులు రౌడీ మూకల కారణంగా భక్తులు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. పోలీసుల అనుమతులు లేకుండా జాతర ప్రాంగణంలో ప్రైవేటు వ్యక్తులు ఎవరు డ్రోన్లను ఉపయోగించకూడదని, ఉపయోగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె వివరించారు. చివరి రెండు రోజులపాటు భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో శ్రీకాకుళం వైపు వెళ్లి వచ్చే వాహనాలను రావివలస కూడలి నుండి నాగం పేట జంక్షన్ వరకు తోటపల్లి కాలువ గట్టు మీదుగా వాహనాలను మళ్లించడానికి చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి తాసిల్దార్ ఎస్ రాజారావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శంకర్రావు. ఎంపీడీవో ఐ సురేష్, దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాసరావు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సుధీర్ ఎస్సై ఎల్ దామోదర్ రావు, విద్యుత్ అగ్నిమాపక పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల : విద్యార్థుల మానసిక, శారీరిక అభివృద్ధికి తోడ్పడే విధంగా విద్యా బోధన చేయాలని సమగ్ర శిక్ష జిసిడిఓ మాలతి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. పరీక్షలు బాగా రాయాలని వివరించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదివే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పరీక్షల టైంలో స్టడీ గంటలు ఏర్పాటు చేసి విద్యార్థులను బాగా చదివించాలని సూచించారు. రానున్న పరీక్షల్లో విద్యార్థులను బాగా చదివించేందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవా లని కోరారు. పరీక్షల్లో విద్యార్థులకు భయం లేకుండా చదివే విధానంతో మార్కులు తెచ్చు కోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఉమ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ దాస ఆంజనేయస్వామి ఆలయ విగ్రహ పుణః ప్రతిష్ఠ

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణంలో గల పాత బస్టాండ్ దగ్గరలో ఉన్న శ్రీశ్రీశ్రీ దాస ఆంజనేయస్వామి ఆలయ విగ్రహ పుణః ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరయ్యారు. ముందుగా ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామి ఆలయ పుణః నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వివాహ వేడుకలో పాల్గొన్న వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర-రాజాం : రాజాం పట్టణంకి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త కొత్తా.మధుసూదనరావు, మాధురి దంపతుల కుమార్తె సాహితి వివాహా శు భకార్యంకి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా పార్టీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి.శ్రీనివాసరావు, మాజీ మంత్రివర్యులు వెల్లంపల్లి.శ్రీనివాసరావు, రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా.తలే.రాజేష్ ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ రూరల్ పార్టీ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాల్ నాయుడు, జడ్పీటిసి బండి.నరసింహులు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి మోహన్, సర్పంచ్లు వాకముళ్ళ చిన్నంనాయుడు, వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహణ

విశాలాంధ్ర-నెల్లిమర్ల : మండల కేంద్రమైన నెల్లిమర్ల మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరములో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ అంబళ్ల సుధారాణి మాట్లాడుతూ విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ప్రజలు ఎవరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా ఈ సమావేశంలో శాఖలు వారీగా రివ్యూ నిర్వహించారు, ఆయాశాఖ అధికారులు వారి ప్రగతి వివరాలను తెలియజేశారు. ఈసమావేశంలో ఎంపీడీవో కె రామకృష్ణ రాజు, గ్రామపంచాయతీ సర్పంచులు ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన, న్యాయ అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రాజాం : ఈరోజు అనగా తేది 22న ఉదయం 11.00 గం.లకు స్థానిక కొండంపేటలో ఉన్న వృద్ధాశ్రమంను మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ సందర్శించి వృద్ధులతో మాట్లాడి వారి బాగోగులను, వారికి అందుతున్న వైద్య సదుపాయాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమంలో ఉంటున్న వారికి పండ్లు అందజేశారు. అనంతరం నిర్వాహకులు న్యాయమూర్తి వారిచే మొక్కను నాటించడం జరిగింది. అనంతరం న్యాయ అవగాహన సదస్సును కూడా నిర్వహించడం జరిగింది. వృద్ధులపట్ల వారి కుటుంబ సభ్యుల బాధ్యతలను తెలియజేశారు. నల్సా (వృద్ధులకు న్యాయ సేవలు) పథకం, 2016 గూర్చి వివరించారు. వృద్ధులకోసం ప్రత్యేక పథకాలు కూడా ఉన్నాయని వాటిని తెలుసుకొని సహాయసహకారాలు పొందాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హత ఉండికూడా అందని పక్షములో, న్యాయ పరమైన సహాయసహకారాల కోసం న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించి న్యాయాన్ని పొందాలని తెలియజేశారు. పిల్లలు, కుటుంబ సభ్యులు ఉండికూడా నిరాదరణకు గురయినవారు ఈ వృద్ధాశ్రమంలో ఉన్నట్లయితే కుటుంబ సభ్యుల వివరాలు మండల న్యాయ సేవాసంస్థకు తెలియజేస్తూ ధరఖాస్తు చేసుకున్నట్లయితే వారి కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడి వారి భాధ్యతలను గుర్తుచేస్తామని హామీ ఇచ్చారు. వృద్ధాప్యము అనేది ప్రతి మనిషి జీవితంలో ఒక భాగమని, వృద్ధులపట్ల చిన్నచూపు తగదని వారికి చేయూతనిచ్చి ప్రేమాభిమానాలను పంచాలని సూచించారు. కుటుంబ సభ్యులు అందరూ ఉండి కూడా వృద్ధులను అనాధులుగా చేస్తున్నారని, ఇది అత్యంత బాధకారమైన విషయం అని అన్నారు. వృద్ధుల అభ్యున్నతికి పాటుపడుతున్న వృద్ధాశ్రమ నిర్వహకులను కొనియాడారు. ఈ సదస్సులో పి.శ్రీనివాస్, న్యాయవాది వృద్ధాశ్రమ డైరెక్టర్, ఇతర డైరెక్టర్లు ఎస్. పోలరావు (ప్రభుత్వ న్యాయవాది ఆశ్రమ డైరెక్టర్), కె.సాయిప్రశాంత్ కుమార్ (రాజాం రెడ్ క్రాస్, మానవతా చైర్మన్), పి.చైతన్యకుమార్ (రెడ్ క్రాస్, మానవతా మెంబర్), ఏం.ఆదినారాయణలతో పాటుగా, వృద్ధాశ్రమ సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనకు మార్చి 12,13 తేదీల్లో ఛలో ఢిల్లీ

ఏపీ బిసి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఉత్తరాంధ్ర అధ్యక్షులు వెల్లడి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : బిసిల హక్కుల సాధనకు మార్చి 12,13 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నడిపేన శశి భార్గవి, ఉత్తరాంధ్ర అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు తెలిపారు. శనివారం జమ్ములో వారి నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం లో బిసి ల సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసి అభివృద్ధి కి చర్యలు తీసుకున్నారు, అదేవిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం బిసి ల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని వివరించారు. గత పాలకుల హయాంలో బిసి కార్పొరేషన్ పదవులు ఇచ్చి నిధులు ఇవ్వకుండా సంక్షేమం విస్మరించారని పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ బిసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి గా ఆయన ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం బిసి ల సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందడానికి బిసి మహిళలు కు రాజకీయాల్లో రిజర్వేషన్లు దక్కాల్సిన అవసరం ఉంది, బిసి కులాల గణన చేసి ఏపి బిసీ సామాజిక వర్గాలు ఎంత శాతం మంది ఉన్నారో సరైన గణాంకాలు లేవు వాటిని సాధించడానికి అవసరమైన పోరాటం చేస్తామని చెప్పారు. ఇందుకోసం మార్చి లో 12,13 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో బిసిల హక్కుల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. అలాగే కళాశాల విద్యార్థులను కలిసి చైతన్య పరుస్తూ వారిలో విద్య పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి ముందు కు తీసుకెళ్తామని తెలిపారు. ఏ పదవిలో ఉన్నా ప్రజలు కోసం పని చేయడం, కూటమి ప్రభుత్వం బాటలో బిసి ల అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో బిసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కోరాడ రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఆల్తి వీరు వెంకట సత్యనారాయణ, ఆల్తి చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సి ఎన్నికల్లో టీడీపీ కుట్ర

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : ప్రభుత్వం అధికార, ధనబలంతో ఒక ఇండిపెండెంట్ బి.సి. అభ్యర్థిని ఏదోవిధంగా ఓడించాలన్న దురుద్దేశ్యంతో నిరంకుశమైన విధానాలతో ముందుకు వెళ్ళడం ఎంతమాత్రం సమంజసం కాదని పలు సంఘాల నాయకులు ముక్తకంఠంతో ఖండించారు. విజయనగరం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో పలు సంఘాలు నాయకులు ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగిన గాదె శ్రీనివాసుల నాయుడుకు మద్దతు పలికారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్.ఎల్.సి. ఎన్నికలలో సోషల్ జస్టిస్ ఫోరమ్ - బి.సి. ఐక్యవేదిక, కాపు ఐక్యవేదిక, %జుబొ% హక్కుల పరిరక్షణ వేదిక, దళిత క్రైస్తవ హక్కుల పరిరక్షణ వేదిక, మహిళా హక్కుల పరిరక్షణ వేదికల పక్షాన ఎస్.జె.ఎఫ్. తరవున ఇండిపెండెంట్ అభ్యర్థి, బి.సి. సామాజికవర్గానికి చెందిన గాదె శ్రీనివాసుల నాయుడుకు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని అన్నారు. పోటీలో ఉన్న ఇతర ఇండిపెండెంట్ అభ్యర్థులను బ్యాలెట్ పేపర్ ముద్రణ తర్వాత కూడా బలవంతంగా వారిని సైలెంట్ చేయిస్తూ ఏదోవిధంగా గెలుపుబాటలో ఉన్న శ్రీనివాసుల నాయుడుని ఓడించడానికి టి.డి.పి. చేస్తున్న విశ్వప్రయత్నాలు ఏవిధంగా ధర్మం? ఇదేనా ప్రజాస్వామ్యం? గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏమిటి? అని ప్రశ్నించారు. బి.సి.ల పార్టీ అని చెప్పుకునే టి.డి.పి. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్.ఎల్.సి. ఎన్నికలలో మూడు స్థానాలకు గాను ఒక్క స్థానంలో కూడా బి.సి.లకు అవకాశం ఇవ్వలేదు, సరికదా గెలుపు అవకాశాలు బలంగా ఉన్నా బి.సి. అభ్యర్థిని ఏదోవిధంగా ఓడించి వక్రమార్గంలో తమ అభ్యర్థిని గెలిపించుకోవడానికి టి.డి.పి. చేస్తున్న అప్రజాస్వామిక విదానాలను ఎస్.జె.ఎఫ్. పక్షాన ఖండిస్తున్నామని అన్నారు. టి.డి.పి.కుల దురహంకారంతోటి, ధన దురహంకారంతోటి, అధికార దురహంకారంతోటి నిరంకుశంగా ముందుకు వెళుతూ ఉంటే ఎస్.జె.ఎఫ్. పక్షాన చూస్తూ ఊరుకోబోమని ఇక్కడ జరుగుచున్న అప్రజాస్వామిక విధానాలను రాష్ట్రమంతటా విస్తృతంగా ప్రచారం చేసి బి.సి.లపైన, కాపులపైన టి.డి.పి. చూపిస్తున్న కపట ప్రేమను దేశవ్యాప్తంగా ఎండకడతామని ఈసందర్భంగా ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని అన్నారు . ఉపాధ్యాయ ఎమ్.ఎల్.సి. ఎన్నికలలో గతంలో ఎన్నడూ కూడా ఈ మాదిరిగా ఏ ప్రభుత్వం కూడా ఇంతగా దిగజారిపోయి వ్యవహరించలేదని, ప్రభుత్వం వారు ఇప్పటికైనా హుందాగానూ, ప్రజాస్వామ్యబద్ధంగానూ వ్యవహరించి ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేవిధంగా సహకరించాలని ఎస్.జె.ఎఫ్. పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు జంగాల సింగరయ్య యాదవ్, రావి శ్రీనివాస్, దానా గౌడ్, బోడపాటి పెదబాబు, పంచాది రంగారావు పాల్గొన్నారు.

చంద్రబాబుపై బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు హాస్యాస్పదం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు మీద బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. అశోక్ బంగ్లాలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు ద్రోహి అని వ్యాఖ్యలు చేయడం కరెక్ట్ కాదుని గత ప్రభుత్వంలో రైతులకు పెట్టిన బకాయిలు తీర్చింది ఎవరో తెలుసుకోండి 2023 ఏడాదికి సంబంధించి రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం డబ్బులు యెగ్గొట్టారని ఆయన అన్నారు. ఆ డబ్బుని రైతులు అకౌంట్లో కూటమి ప్రభుత్వం జమ చేసింది తద్వారా చాలా మంది రైతులు సంక్రాంతినీ హ్యాపీగా జరుపుకున్నారని కొనియాడారు . ఈ ఏడాది కూడా ధాన్యం సేకరించిన 48 గం.ల్లోనే డబ్బులు కూటమి ప్రభుత్వం జమ చేశాం అని అన్నారు. రైతు అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుంది రైతులు కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం. డ్రిప్ ఇరిగేషన్, సోలార్ వంటి ప్రాజెక్టులు కూడా తీసుకొచ్చింది ఒక్క చంద్రబాబు నాయుడు మాత్రమే అని అన్నారు. మిర్చి యార్డుకు వచ్చి జగన్ కావాలనే నాటకాలు ఆడుతున్నారని మిర్చి ధరపై కేంద్ర ప్రభుత్వంతో నిత్యం మా ఎంపీలు మాట్లాడుతూనే ఉన్నామని తద్వారా రాష్ట్ర ప్రభుత్వం కూడా సరైన మద్దతు ధర కల్పించిందని ఆయన పేర్కొన్నారు. మంత్రుల్ని, ఎంపీలను, ఎమ్మెల్యేలను కూడా గ్రీవెన్స్‌లో కూర్చోబెట్టి సమస్యలను క్లియర్ చేయమంటున్న గొప్ప వ్యక్తి చంద్రబాబు ఇలాంటి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైసీపీకి లేదని స్నేహ పూర్వక వాతావరణాన్ని కల్పించే విధంగా నూతన రాజకీయ మార్పుకు నాంది పలకాలని రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపించాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారన్నారు. చేతనైతే సలహాలు ఇవ్వండి గానీ హాస్యాస్పదంగా మాట్లాడటం బొత్సకు తగదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శాసనసభ్యులు అతిథి విజయలక్ష్మి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మి సెంటెన్స్ స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-రాజాం : రాజాం పట్టణంలో వరలక్ష్మి సెయింట్ ఆన్స్ స్కూల్ యాజమాన్యం విద్యార్థుల విద్యార్థులతో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. పర్యావరణ హిత ప్రాజెక్టులు, ఆరోగ్యం పరిశుభ్రత పర్యావరణంలోని మార్పులు, గణిత నమూనాల తదితర 150 ప్రాజెక్టులు విద్యార్థులు రూపొందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఇటువంటి ప్రయోగాలతో విద్యార్థుల మేధాశక్తి పెరుగుతుందని ఆయన అన్నారు.

సెకి విద్యుత్ ఒప్పందంపై ఏఆర్‌ఆర్ నివేదిక జగన్ పరిపాలనకు మచ్చుతునక

ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీపీ సురేష్ ముఖర్జీ, జెడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శనరావు

విశాలాంధ్ర-వంగర : సెకి ఒప్పందంపై ఏఆర్అర్ నివేదిక మచ్చు తునకని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీపీ సురేష్ ముఖర్జీ, జెడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శనరావు అన్నారు. శనివారం మండలంలో ఇరువాడ గ్రామంలో రామ మందిరం వద్ద ఆయన విలేఖర్లతో మాట్లాడారు. 7వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందం చారిత్రాత్మకంగా వర్ణించారు. నిజమైన సంపద సృష్టి జగన్‌తోనే సాధ్యమన్నారు. పచ్చ మీడియా కథనాలకు ఏ ఆర్ ఆర్ తీర్పు చెంపపట్టు చెంపపెట్టుగా పేర్కొన్నారు. సఖి ఒప్పందంపై ఏఆర్‌ఆర్ ఇచ్చిన తీర్పు జగన్ పరిపాలన తీరుకో అద్దం పట్టిందన్నారు శక్తి ఒప్పందంపై లేనిపోని అపోహలు కట్టుకథలు కల్పించారనే ఈ నివేదికతో ఇవేవీ వాస్తవం కాదని రుచువయిందన్నారు. సత్యాన్ని ఎప్పుడూ దాచలేరన్నారు. శక్తి ఒప్పందం ఒక చారిత్రాత్మకసత్యాన్ని ఎప్పుడూ దాచలేరన్నారు. శక్తి ఒప్పందం ఒక చారిత్రాత్మక నిర్ణయమై నిజమైనసంపద సృష్టి ఇటువంటి ఒప్పందాలతోనే సాధ్యమన్నారు. చరిత్రలో 7000 మెగావాట్ల విద్యుత్ కు సంబంధించి ఇటువంటి నిర్ణయాలు ఇప్పుడు ఎక్కడ జరగలేదన్నారు. ఈ ఒప్పందంలోఎటువంటి అవకతవకలు లేవని, విద్యుత్ ఎంత చౌకగా కొనుగోలు చేసిన ఒప్పందం ఏదైనా ఉంటే అది జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ అధీనంలోనే సెకి అనేశక్తి సంస్థతో చేసుకున్న ఒప్పందమే ఒకటేనని ఆయనఘంటా పదంగా చెప్పారు. పరిపాలన చేతకాక గత ప్రభుత్వంపై ప్రతి తప్పును నెట్టివేయాలన్నా కూటమి ప్రభుత్వం కుట్రలో ఇది ఒక భాగమని ఆయన పేర్కొన్నారు.దీనికి వంతు పాడుతు పచ్చి మీడియా అసత్యాలను వండి వార్చుతోందనే ఆయన ఆరోపించారు. అంతకుముందు ఆయన ఇరు వాడగ్రామంలో కొత్తగా నిర్మించిన రామ మందిరాన్ని సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్ణయమై నిజమైనసంపద సృష్టి ఇటువంటి ఒప్పందాలతోనే సాధ్యమన్నారు.

జిసిఎస్‌ఆర్ కళాశాలలో ఘనంగా క్రీడా వారోత్సవం

విశాలాంధ్ర-రాజాం : స్థానిక జిసిఎస్‌ఆర్ కళాశాలలో క్రీడా వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెయిట్ లిఫ్టర్ ఎర్ర చైత్న కుమారి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు శారీరక ఉల్లాసంతోపాటు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో జి.ఎం.ఆర్.ఐటి వ్యాయామ అధ్యాపకులు డాక్టర్. బి.హెచ్. అరుణ్ కుమార్ పాల్గొని విద్యార్థులకు ఉపాధి అవకాశాలు దక్కించుకోవడంలో క్రీడలు ముఖ్యపాత్ర పోషిస్తాయని, ప్రభుత్వాలు కూడా క్రీడలు ప్రోత్సాహానికి చాలా వరకు కృషి చేస్తున్నాయని విద్యార్థులనుదేశిస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎం .పురుషోత్తం రావు క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్. రవీంద్ర కుమార్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రఘువర్మకు మొదటి ప్రాదాన్యత ఓటు వేయండి

మండలంలో ఊపందుకున్న టీడీపీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-జామి:ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాదాన్య ఓటు వేయాలని మండలంలోని ఉపాధ్యాయులను తెలుగుదేశం పార్టీ నేతలు కోరారు. మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని జోరుగా సాగుతోంది. అందులో భాగంగా శనివారం మండలంలోని జామి, విజినిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ, రామాస్కూల్‌లోనూ ఉపాధ్యాయ ఓటర్లును టీడీపీ నేతలు నేరుగా కలుసుకుని రఘువర్మకు ఓటు వేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుదు, ప్రధానకార్యదర్శి వర్రిరమణ, దనియాల పైడిరాజు, కొటాన విజయ్‌కుమార్‌లతోపాటు రాయవరపు శంకర్, రాయవరపు శ్రీను, ఎన్నింటి అప్పలరాజు, అల్లాడ పెద్దతోపాటు పలువురు నేతలు ప్రచారంలో పాల్గొన్నారు.

పోలిపల్లి కాలువను పరిశీలించిన ఇరిగేషన్ ఏఈ

విశాలాంధ్ర-భోగాపురం : మండలంలో చెరుకుపల్లి వద్దనున్న పోలిపల్లి కాలువను నీటిపారుదల శాఖ ఏఈఎం రమేష్‌చంద్ర శనివారం పరిశీలించారు. ఈకాలువ పై చెరుకుపల్లి వద్ద వివిధ గ్రామాలకు వెళ్లే విధంగా చెక్ డ్యామ్ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరడంతో కాలువను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిధులు కానీ దివిస్ కంపెనీకి చెందిన సిఎస్‌ఆర్ నిధులతో చేయాలని గ్రామ పెద్దలు సరగడ తోగులు రెడ్డి, టి.గురుమూర్తి, ఆర్ దుర్గారావు తదితరులు కోరారు. దీనిపై స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

ప్రధాన కాలువలను ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేయాలి

విశాలాంధ్ర-విజయనగరం : నగరంలో ప్రధాన కాలువలను ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేయాలని ప్రజారోగ్య సిబ్బందికి విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. దీంతో గంటస్తంభం ప్రాంతంలో ఉన్న ప్రధాన కాలువ పూడికతీత పనులు ముమ్మరంగా చేపట్టారు. జెసిబి సహాయంతో కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి వేశారు. ప్రత్యేక పారిశుధ్య బృందం చెత్తలను తొలగించి పరిశుభ్రచారు. ఈ ప్రక్రియను స్వయంగా కమిషనర్ పల్లి నల్లన్నయ్య పరిశీలించారు. అవసరమైన సూచనలను చేశారు. ప్రధానంగా మార్కెట్ ప్రాంతం కావడంతో కాలువలో చెత్తాచెదారాలను వేస్తున్నారని ఇక నుండి వ్యాపారస్తులు తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకొని వాటిలోనే చెత్తాచెదారాలు వేసే విధంగా చైతన్యం తీసుకురావాలని సిబ్బందికి ఆదేశించారు. రహదారుల్లో, కాలువల్లో చెత్తలు వేసినట్లయితే అపరాధ రుసుములు వసూలు చేయాలని సూచించారు.

చామలాపల్లిలో భారీ అన్న సమారాధన

ప్రసాదాలు స్వీకరించిన వేలాది మంది భక్తులు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని చామలాపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీసంతాన కుమార సుబ్రహ్మణ్యస్వామి, శ్రీఅభయాంజనేయ స్వామి వార్ల తీర్థ మహెూత్సవం సందర్భంగా గ్రామస్తులు పెద్దల ఆధ్వర్యంలో శనివారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం 6గంటల నుంచి స్వామివార్ల ఆలయం సమీపంలో వేద పండితుల నడుమ పూజలతో పాటు హెూమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ వెంకటరమణపేట వారిచే మహిళా కోలాటం,సాయంత్రం ఆరు గంటల నుంచి శ్రీ రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం,రాత్రి 9గంటల నుండి శ్రీకాకుళం జిల్లా వారిచే సీతారామ కళ్యాణం బుర్రకథ కదురమ్యంగా నిర్వహించారు. అలాగే 23న ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుండి ఎడ్ల పరుగు పోటీలు,సాయంత్రం 5గంటల నుంచి బైక్ స్లో పోటీలు జరుగుతాయన్నారు.అనంతరం విశాఖ త్రిల్లర్స్ వెంకట్ నెల్లూరు బృందం వారిచే డ్యాన్స్ బేబి డ్యాన్స్ నృత్య ప్రదర్శనలు జరుగుతాయని గ్రామ పెద్దలు తెలిపారు.

పాకలపాటి రఘువర్మకు టీడీపీ నాయకుల విస్తృత ప్రచారం

విశాలాంధ్ర-మెరకముడిదాం : చీపురుపల్లి శాసన సభ్యులు కిమిడి కళా వెంకటరావు ఆదేశాలు మేరకు తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం మద్దతు ప్రకటించిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ అభ్యర్థిత్వాన్ని బలపరిచి, ఫిబ్రవరి 27 న జరిగే ఎన్నికల పోలింగ్ లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మెరకముడిదాం మండల టీడీపీ నాయుకులు మండలం లో గల గర్భం హైస్కూల్ మరియు మోడల్ స్కూల్ బైరిపురం హైస్కూల్ బిళ్లలవలస హైస్కూల్ లలో ప్రచారం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు మరియు మండల టీడీపీ నాయుకులు కోట్ల మోతిలాల్ నాయుడు, తాడ్డి చంద్రశేఖర్, కెంగువ ధనుంజయ్, సుబ్బరాజు,రెడ్డి వరం, బంగార్రాజు, తాడ్డి శ్రీధర్, బంగారునాయుడు,కెంగువ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆశి లక్ష్మీప్రియాంకకు డాక్టరేట్ ప్రధానం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని ఆశి లక్ష్మీప్రియాంక డాక్టరేట్ అందుకున్నారు. "రోల్ ఆఫ్ ఏఐ పవర్డ్ స్మార్ట్ స్పీకర్స్ ఇన్ షేపింగ్ ఈ - కస్టమర్స్ బిహేవియర్ అండ్ పర్చేజింగ్ పాటర్న్స్ - ఏ స్టడీ ఆన్ సెలెక్ట్ సిటీస్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్, ఇండియా "అనే అంశంపై ప్రొఫెసర్ ఎం.ఉమాదేవి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఈమె విజయనగరంలోని సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ కళాశాలలో మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు.ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు ప్రొసీడింగ్స్ ఇచ్చి అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ ప్రిన్సిపాళ్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, తోటి పరిశోధకులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

సీతంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా చిత్రకళా ప్రదర్శన

విశాలాంధ్ర- విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా చిత్రకళా ప్రదర్శన నిర్వ హించారు. ఈ కార్య క్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, డ్రాయింగ్, పెయింటింగ్, మెహెందీ డిజైన్ల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల సృజనాత్మకత, అభిరుచి ఈ కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకంగా మార్చింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణరావు విద్యార్థులలో దాగివున్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని అధ్యాపక బృందానికి సూచించారు. విద్యార్థులు తమ ప్రతిభను మరింత అభివృద్ధి చేసుకుని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈపోటీకి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకట లక్ష్మి, ఆర్&డీ డీన్ డాక్టర్ వి.జి.ప్రసూన న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈకార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాగా ఉడికిన కోడి మాంసం, గుడ్డు తినండి

సర్వసభ్య సమావేశంలో వెటర్నరీ డాక్టర్

విశాలాంధ్ర-పూసపాటిరేగ : బాగా ఉడికించి కోడి మాంసం, గుడ్డు తినవచ్చని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వెటర్నరీ డాక్టర్ తెలిపారు. సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఎలాంటి వైరస్ అయినా డబ్బై డిగ్రీల ఉష్ణోగ్రత లో బతక గలదు. అందుకే వంద డిగ్రీ ల ఉష్ణోగ్రత కు బాగా ఉడికించిన తర్వాత ఏ వైరస్ బతకడం జరగదు.కనుక నిర్భయంగా తినవచ్చు అని తెలిపారు.తదుపరి ఎమ్మార్వో పి గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద రీసర్వే మండలంలో గోవిందపురం గ్రామాన్ని ఎంచుకొని పూర్తి చేస్తుందని రి సర్వేకు సంబంధించి ఏసమస్య లేని భూములు యధాతథంగా పాస్ పుస్తకాలు ఇవ్వబడతాయని క్షేత్రస్థాయిలో తక్కువ ఎక్కువ ఉన్న భూములను విచారణ అనంతరం సరిచేసి పాస్ పుస్తకాలు అందిస్తామని దీనికిగాను రెవిన్యూ సిబ్బంది గ్రామాల్లో సంచరించి గ్రామ సభ జరిపి సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీటీసీలు సర్పంచులు ఎంపీపీ జడ్పిటిసి పాల్గొన్నారు.

శారద జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేత శృంగవరపుకోట

- ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్
- ఎమ్మెల్యే కోళ్ల చేతులమీదుగా విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర-కొత్తవలస : కంటకాపల్లికి చెందిన 'శారద పరిశ్రమ' యాజమాన్యం వారి సహకారంతో విజయనగరం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండురోజులపాటూ నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో శృంగవరపుకోట నియోజకవర్గ జట్టు విజేతగా నిలిచింది. భారత్ డిఫెన్స్ అకాడమీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా నుంచి 9నియోజవర్గాల నుంచి 9టీములు పాల్గొనగా అందులో పార్వతీపురం, శృంగవరపుకోట జట్లు విశేష ప్రతిభను కనబరచి ఫైనల్స్ కు చేరుకున్నాయి. రెండు జట్లు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ పోరులో శృంగవరపుకోట ప్రథమస్థానాన్ని కైవసం చేసుకోగా, పార్వతీపురం ద్వితీయ స్థానంలోనూ, 3వ స్థానంలో కురుపాం జట్టు, 4వ స్థానంలో విజయనగరం జట్లు నిలిచాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ కే.కృష్ణంరాజు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సూరిబాబు, సెక్రటరీ కె.వి.ఎ.ఎన్.రాజు ప్రకటించారు. ఫైనల్ మ్యాచ్ లో శృంగవరపుకోట నియోజకవర్గం జట్టు విజయం సాధించి, ప్రథమ స్థానంలో ప్రైజ్ మనీ రూ.లక్ష25 వేలు గెలుచుకోవడం సంతోషదాయకమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అభినందించారు. విజేతలకు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, శారద పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ దాస్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాత్ మోహన్, ఆమె చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. 2వ బహుమతిగా రూ.60వేలు, 3వ బహుమతిగా రూ.30వేలు, 4వ బహుమతిగా రూ.25వేల నగదుతో పాటూ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, టిడిపి సీనియర్ నాయకులు కోళ్ల శ్రీను, భారత్ డిఫెన్స్ అకాడమి డైరెక్టర్ కదారి రాజు, పరిశ్రమ సీనియర్ జి.ఎంలు అశోక్ కుమార్ చౌదరి, విజయభాస్కర్, అడ్వైజర్ మూర్తి, డీజిఎం హెచ్‌ఆర్ సన్యాసిరావు, సీనియర్ మేనేజర్ పద్మాకర్, హెచ్‌ఆర్ సిబ్బంది శంకర్రావు, సంతోష్, వాలీబాల్ కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లను అదుపు చేసేందుకు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులకు ప్రత్యేక శిక్షణ : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో ఎక్కడైనా అల్లర్లు చెలరేగితే వాటిని అదుపు చేసేందుకు ఆర్మ్ డ్ రిజర్వు పోలీసులు వ్యవహరించాల్సిన తీరు, నిర్వహించాల్సిన విధులకు సంసిద్ధం చేసేందుకు 14 రోజుల పాటు పునశ్చరణ తరగతుల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు నిర్వహించాల్సిన వివిధ విధులు, వినియోగించాల్సిన ఆయుధాలు గురించి 14రోజులపాటు నిర్వహిస్తున్న పునశ్చరణ (మొబిలైజేషను) తరగతుల్లోవివరించామన్నారు. వీటితోపాటు జిల్లాలో ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు ఎదురైతే వాటిని ఎదుర్కొనేందుకు ఏవిధంగా సమాయత్తం కావాలన్న విషయంపై ఆర్మ్ రిజర్వు పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆందోళనలు చేపట్టే సమయాల్లో ఎక్కువగా గుమిగూడే ఆందోళనకారులను ముందుగా ఏవిధంగాహెచ్చరించాలి, చెదరగొట్టాలని, ఆందోళనలో ఎవరైనా గాయపడితే వారిని ఎలా తరలించాలి, వారి దాడులు ఏవిధంగా ప్రతిఘటించాలి, రక్షణాత్మకమైన చర్యలు ఏవిధంగా చేపట్టాలి, శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ఏవిధంగా చర్యలు చేపట్టాలని, ఆందోళనకారులు రెచ్చిపోకుండా ఏవిధంగా సమన్వయం పాటించాలి, విధులు నిర్వహించాలన్న అంశంపై పోలీసు సిబ్బందిని సమాయత్తం చేసామన్నారు. ఈతరహా విధులు పోలీసు సిబ్బంది నిర్వహించి సాధారణవిధుల కంటే భిన్నమైనవన్నారు. ఆందోళనకారులు చేపట్టే కార్యక్రమాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించి, వారితో శాంతియుతంగా వ్యవహరిస్తూ వారి చర్యలను నియంత్రించడం పోలీసులకు సవాలుగా నిలుస్తాయన్నారు. మాబ్ ఆపరేషనులో భాగంగా పోలీసు పరేడ్ గ్రౌండులో ఆందోళనకారులను అదుపు చేయుటకు ఆర్మ్ పోలీసులు హెల్మెట్స్, ఫేస్ షీల్డులు, బాడీ ఆర్మర్, గ్లోవ్స్, అలాగే చేతులు, కాళ్ళకు రక్షణగా ప్యాడ్లు ధరించి మాక్ ఆపరేషను నిర్వహించారు.గుంపులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ను ప్రయోగించి, శాంతిభద్రతల నిర్వహణలో ఎటువంటి కఠినమైన విధులనునిర్వహించాల్సి ఉంటుందన్న విషయమై అధికారులు పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్ పెక్టర్లు ఎన్. గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.శ్రీనివాసరావు, పలువురు రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్లు, ఆరె పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ధర్మవరం ఇంటర్ కళాశాల వీడ్కోలు వేడుకలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల హై స్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 11 మంది, ప్రథమ సంవత్సరం చదువుతున్న 16 మంది విద్యార్థినిలు కూడా ఉత్తీర్ణత సాధించి హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ బాలికల కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు, ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు చిరుకానుకలు అందించారు. పిఇటి అధ్యాపకులు పొట్నూరు శివాజీ, రహీం షేక్ లాల్, టి రాజేష్, ఎస్ వి ఎస్ ఎన్ మూర్తి (సతీష్ మాస్టర్), అరసాడ సురేంద్రనాథ్, చింతాడ కృష్ణంరాజు తదితరులు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలు పరీక్షలు బాగా రాసి వారి తల్లిదండ్రులకు ధర్మవరం గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రథమ మరియు ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

26వ డివిజన్లో పర్యటించిన నగరపాలక సంస్థ కమిషనర్

విశాలాంధ్ర-విజయనగరం : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య 26వ డివిజన్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. సాధ్యమైనవి వెనువెంటనే పరిష్కరించేందుకు సిబ్బందికి తగు ఆదేశాలు ఇచ్చారు. కోరాడ వీధి, ఎంఆర్ కాలేజ్, గురజాడ అప్పారావు రోడ్, మూడు లంతర్లు తదితర ప్రాంతాల్లో పర్యటించి రహదారులకి అడ్డంకిగా ఉన్న వాటిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. అలాగే తమ వీధిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని వాటి బారిన పడి కొంతమంది గాయాలపాలు అయ్యారని స్థానికులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. వెంటనే కుక్కలను అదుపులోకి తీసుకొని యాంటీ రేబిస్ టీకాలను వేయించాలని, అలాగే సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయించాలని సిబ్బందికి కమిషనర్ ఆదేశించారు. కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు చెప్పడంతో అందుకుగల కారణాలను ఆరా తీసారు. తక్షణమే వీధి లైట్ల మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పునరుద్ధరించాలని ఆదేశించారు. కొన్నిచోట్ల కొళాయి నీరు వృదాగా పోవడాన్ని ఆయన గమనించారు. తాగునీరు వృదాగా పోకూడదని వెంటనే ఆన్ ఆఫ్ స్విచ్లు బిగించుకోవాలని సూచించారు. పలుచోట్ల ఫ్లెక్సీలు, ఇతర బ్యానర్లు తొలగించి వేశారు. ఈ సందర్భంగా కమీషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజా సహకారంతోనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పదేపదే చెబుతున్నప్పటికీ పలువురు ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం మంచి విధానం కాదన్నారు. అలాగే రహదారులను ఆక్రమించి బడ్డీ కొట్లు ఇతర దుకాణాల ద్వారా వ్యాపారాలు సాగించడం వల్ల ప్రజలకు, ప్రజా రవాణాకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. అట్టి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. అనుమతులు మంజూరైన తర్వాతనే ఎటువంటి నిర్మాణాలైనా నగరంలో చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో నగర పాలక సంస్థ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సోంపురం జిల్లా పరిషత్ హైస్కూలులో పునశ్చరణ దినోత్సవం

ఇన్చార్జి హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ హై స్కూల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పునశ్చరణ దినోత్సవం నిర్వహించబడిన దని పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం భారత్ స్కౌట్స్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ బెడెన్ పావెల్ జన్మ దినాన్ని పురస్కరించుకొని దేశంలో ప్రతిఏటా జరుపుకొనే ఈ పునశ్చరణ దినోత్సవాన్ని బేసిక్ స్కౌట్ మాస్టర్ పి.రమేష్ నాయుడు పర్యవేక్షణలో పాఠశాల సేవా స్కౌట్ యూనిట్ అలాగే నయా మునీసా పర్యవేక్షణలో రుద్రమ దేవి గైడ్ యూనిట్ విన్యాసాలు చేశారు. ఉదయం గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్కౌట్స్, అండ్ గైడ్స్ సర్వమత ప్రార్థన,బెడెన్ పావెల్ కు నివాళులర్పించారు.కలర్ పార్టీ, ఫ్లాగ్ ప్రొసీజర్,టెంట్ ఇన్స్పెక్షన్,ఫుడ్ ప్లాజా, క్విజ్ పోటీ, మోడల్ పయోనీరింగ్, ఫిజికల్ డిస్ప్లే , పీజెంట్ షో, మొదలైన స్కౌటింగ్ నైపుణ్యాలు సేవాశ్రీ స్కౌట్ యూనిట్ నుండి అజయ్, సుధీర్, చైతన్య, రోహిత్, శశివర్ధన్, ఎర్నాయుడులు అలాగే రుద్రమదేవి గైడ్ యూనిట్ నుండి హాసిని, స్వరూప, మేఘన, ధనుశ్రీ,హైందవి ఆధ్వర్యంలో నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా కమీషనర్ (అడల్ట్ రిసోర్సస్) బి.పి.ఏ.రాజు శిక్షణలో ముందు రోజు నిర్వహించిన ప్రవేశ, ప్రథమ సోపాన్ పరీక్షలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఉన్నత విద్యా,ఉద్యోగ అవకాశాలలో ప్రత్యేక కోటా కలిగిన ఈ స్కౌటింగ్ కోర్సులలో విద్యార్థులందరిని చేర్చి విద్యార్థులలో క్రమ శిక్షణ, విలువలు అలవరచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న ప్రయత్నానికి తల్లి దండ్రులు సహకరించాలని ఉపాధ్యాయ సిబ్బంది రవిశంకర్, జగన్నాథం, గౌరి, శ్రీనివాసరావు, గోవింద,భవాని, సన్యాసిరావులు కోరారు.

క్షయ వ్యాధిపై కేంద్ర బృందం అవగాహన

టీబి వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్లు పంపిణీ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో వేపాడ పిహెచ్సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు కేంద్రం బృందం అవగాహన కల్పించారు. అలాగే పి.ఎం.టి.బి.ఎం.బీ.ఏ పథకంలో భాగంగా టీబీ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్స్ ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా 100 రోజుల టీబీ కార్యక్రమం పై ప్రజలకు.టీబి ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా భారత ప్రభుత్వం ఎం.ఓ.హెచ్.ఎఫ్.డబ్ల్యు డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ ఆశిమా భట్నాగర్, రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ టీబి టి. వైద్యులు నేహా సటోయియా రమేష్,కన్సల్టెంట్,డాక్టర్ కే. రాణి డిఎల్ఏటిఓ, తదితరులు టీబీ పై జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. అదేవిధంగా టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు,ఎక్సరేలపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని భర్తవానిపాలెం గ్రామంలో ఎక్సరే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఏ.ధరణి, ఎంపీడీఓ సిహెచ్ సూర్యనారాయణ, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.